'మనూ'లో ఎంబీఏ, ఎంకామ్ కోర్సులలో ప్రవేశాలు

దరఖాస్తుల సమర్పణకు చివరి తేదీ మే 20

రాయదుర్గం: మనూ విశ్వవిద్యాలయంలో ఉర్దూ మాధ్యమంలో ఎంబీఏ, ఎంకామ్ కోర్సులలో ప్రవేశాలకు దరఖాస్తులు కోరుతున్నామని ఆ విభాగాధిపతి ప్రొఫెసర్ మహ్మద్ అబ్దుల్ అజీమ్ మంగళవారం తెలిపారు. ఏఐసీటీఈ సిఫార్సు చేసిన సిలబస్‌నే బోధిస్తున్నామన్నారు. ఏదైనా సబ్జెక్టులో 50 శాతం మార్కులతో గ్రాడ్యుయేషన్‌లో ఉత్తీర్ణత సాధించిన అభ్యర్థులు ప్రవేశ ఆధారిత ఎంబీఏ కోర్సులో ప్రవేశానికి అర్హులని ఆయన వివరించారు. ఆన్‌లైన్‌లోనే దరఖాస్తులను సమర్పణకు చివరి తేదీ మే 20గా నిర్ణయించడం జరిగిందన్నారు. అంతేకాకుండా ఉర్దూ మాధ్యమంలో మెరిట్ ఆధారిత ఎంకామ్ కోర్సులో ప్రవేశాలను కూడా అందిస్తోందని, దీనికోసం దరఖాస్తును సమర్పించడానికి చివరి తేదీగా జూన్ 30గా నిర్ణయించామన్నారు. మరింత సమాచారం కోసం ఫోన్ నెంబర్లు 9849325765, 9849847434లలో సంప్రదించాలని కోరారు. యూనివర్సిటీ వెబ్‌సైట్‌లో వివరాలు చూడొచ్చన్నారు.

'ఐఎఫ్ఎస్'కు ఎంపికైన పెద్దిరెడ్డి వాసంతి

హర్షం వ్యక్తం చేసిన హెచ్‌సీయూ ఫ్యాకల్టీ

రాయదుర్గం: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ పూర్వ విద్యార్థిని పెద్దిరెడ్డి వాసంతి ఇండియన్ ఫారెస్ట్ సర్వీస్ (ఐఎఫ్ఎస్)కు ఎంపికయ్యారు. ఆమె సివిల్ సర్వీసెస్ ఐఎఫ్ఎస్ విభాగంలో ఆలిండియా స్థాయిలో 50వ ర్యాంకు సాధించింది. ఈ మేరకు మంగళవారం హెచ్‌సీయూ అధికారులు ఒక ప్రకటన విడుదల చేశారు. హెచ్‌సీయూలో ఆమె హెల్త్‌కేర్ అండ్ హాస్పిటల్ మేనేజ్‌మెంట్ బ్యాచ్ 2015–17లో ఎంబీఏ చేశారు. ప్రతిష్టాత్మకమైన ఇండియన్ ఫారెస్ట్ సర్వీస్‌కి ఎంపిక కావడం హెచ్‌సీయూకు గర్వకారణమని ఫ్యాకల్టీ ప్రతినిధులు పేర్కొన్నారు.

జేఎన్‌వీ హైదరాబాద్ దేశంలోనే టాప్

జేఎన్‌వీ హైదరాబాద్ రీజియన్
డిప్యూటీ కమిషనర్ గోపాలాకృష్ణ

రాయదుర్గం: సీబీఎస్ఈ పది, పన్నెండవ తరగతి బోర్డు పరీక్షలలో నవోదయ విద్యాలయ సమితి హైదరాబాద్ రీజియన్ జయకేతనం ఎగురవేసింది. దేశంలోని అన్ని రీజియన్లలో హైదరాబాద్ రీజియన్ టాప్ స్థానంలో నిలిచింది. ఈ మేరకు మంగళవారం శేరిలింగంపల్లి గోపన్‌పల్లిలోని నవోదయ విద్యాలయ సమితి డిప్యూటీ రీజియన్ కార్యాలయంలో వివరాలను రీజియన్ డిప్యూటీ కమిషనర్ గోపాలాకృష్ణ వివరించారు. దేశ వ్యాప్తంగా 8 రీజియన్లు ఉండగా హైదరాబాద్ రీజియన్ సీబీఎస్ఈ బోర్డు పరీక్షలలో మొదటి స్థానంలో నిలిచిందని తెలిపారు.

బీసీ కులవృత్తుల కార్పొరేషన్ అవసరం

లిబర్టీ: కాంగ్రెస్ ప్రభుత్వం బీసీ కులవృత్తులను కాపాడాలని బీసీ దళ్ జాతీయ అధ్యక్షుడు దుండ్ర కుమారస్వామి కోరారు. క్రమంగా కులవృత్తులు అంతరించిపోయే ప్రమాదం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తరతరాలుగా సంప్రదాయ కులవృత్తులను నమ్ముకొని జీవనం సాగిస్తున్నవారిని కాపాడటంతోపాటు ఆర్థికంగా చేయూతనివ్వటానికి బీసీ కులవృత్తుల కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డికి, ఆర్థిక శాఖ మంత్రి భట్టి విక్రమార్కకు, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌కు విజ్ఞప్తి చేశారు. గీత, నేత, కుమ్మరి, వడ్రంగి వంటి అనేక కులవృత్తుల వారు నేటికీ తమ జీవితాల్లో వెలుగు లేక ఆర్థికంగా చితికిపోయి ఉన్నారని తెలిపారు. కులవృత్తుల కార్పొరేషన్ ఏర్పాటు చేసి రూ.వెయ్యి కోట్లు కేటాయించాలని కుమారస్వామి విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వం ఆ దిశగా అడుగులు వేసి కార్పొరేషన్ ఏర్పాటుకు జీవో జారీ చేయాలని కోరారు.

బొట్టుబిళ్లలతో 'జై శ్రీరామ్'

రాముడిపై భక్తిని చాటుకున్న మహిళా కళాకారులు

పంజగుట్ట: రాముడిపై ఉన్న భక్తిని వినూత్నంగా చాటుకున్నారు ఆరుగురు మహిళలు. ప్రతీరోజు ఐదు గంటలు, మొత్తంగా 12 రోజులు ఎంతో నిష్టగా ఉంటూ 32,970 బొట్టు బిళ్లలతో 30/40 అట్టపై తెలుగు, హిందీ, ఇంగ్లిష్‌లో జై శ్రీరామ్ అని రూపొందించారు. దీనికి అయోధ్య ప్రాజెక్ట్ అని పేరు పెట్టుకున్నారు. ఈ మేరకు మంగళవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో అయోధ్య ప్రాజెక్టును ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రాజెక్టును రూపొందించిన కాసుల పద్మావతి, సూర్యకుమారి, యోగలక్ష్మి, ప్రతిభా దల్, రజనీ మంచికంటి, కోమలి మాట్లాడుతూ.. ఉమెన్ ఆర్టిస్ట్స్ అసోసియేషన్ బ్యానర్‌పై దీన్ని రూపొందించినట్లు తెలిపారు. 16,314 నారింజ బొట్టుబిళ్లలు, 3,192 నీలం బొట్టుబిళ్లలు, 13,464 ఆకుపచ్చ బొట్టుబిళ్లలతో దీన్ని తయారు చేశామన్నారు. ఏప్రిల్ 19న ఏకాదశి రోజు ఈ పవిత్ర కార్యక్రమాన్ని ప్రారంభించామని చెప్పారు. మాంసాహారం తినకుండా, ఎంతో పవిత్రంగా ఉంటూ రూపొందించామని తెలిపారు. డిసెంబర్‌లో తమ బృందం అయోధ్యకు వెళ్లి అయోధ్య మ్యూజియంలో దీన్ని ఉంచనున్నట్లు తెలిపారు. జూబ్లీహిల్స్‌లోని కాసుల పద్మావతి చిత్రకళా అకాడమీలో ప్రతీరోజు 5 గంటలు కష్టపడి దీనిని రూపొందించామని పేర్కొన్నారు.

సీబీఎస్ఈ ఫలితాల్లో సత్తాచాటిన విజ్ఞాన్ విద్యార్థులు



నిజాంపేట్ విజ్ఞాన్ స్కూల్‌లో సీబీఎస్ఈలో ర్యాంక్‌లు సాధించిన విద్యార్థులతో పాఠశాల యాజమాన్యం

నిజాంపేట్: విద్యార్థులపై ఉపాధ్యాయులు చూపిన ప్రత్యేక శ్రద్ధతోనే ఉత్తమ ఫలితాలు సాధ్యమయ్యాయని విజ్ఞాన్ సంస్థల వైస్ చైర్మన్ రాణి రుద్రమదేవి అన్నారు. నిజాంపేట్ విజ్ఞాన్ స్కూల్ విద్యార్థులు సీబీఎస్ఈలో మెరుగైన ఫలితాలు సాధించారు. ఈ నేపథ్యంలో మంగళవారం పాఠశాల ఆవరణలో విలేకరుల సమావేశం నిర్వహించారు. పాఠశాలకు చెందిన వైష్ణవి (498/500)అత్యధిక మార్కులు సాధించి స్టేట్ రాంక్ సాధించగా, సాయి తేజోఆరుణిమ (496/500), ప్రణవ్‌రామ్ మనోహర్ (493/500), హార్దిక 490/500 మార్కులు సాధించారు.

◆ ఈ సందర్భంగా రాణిరుద్రమదేవి మాట్లాడుతూ... తమ పాఠశాలకు చెందిన 380 మంది విద్యార్థులు 80 శాతానికి పైగా మార్కులు సాధించారని పేర్కొన్నారు. ప్రణాళికబద్ధమైన బోధన, సిలబస్ రివిజన్, అంతర్గతంగా పరీక్షలు నిర్వహించడంతోనే ఉత్తమ ఫలితాలు సాధ్యపడ్డాయన్నారు.

◆ అనంతరం బ్రాంచ్ ప్రిన్సిపాల్ పద్మజ మాట్లాడుతూ... విద్యార్థులు మంచి మార్కులు సాధించడంలో ఉపాధ్యాయుల కృషి ఎంతో ఉందన్నారు. వారిచ్చిన సూచనలు, ప్రోత్సాహంతోనే స్టేట్ ర్యాంకులు సాధించగలిగామని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులు, వారి తల్లిదండ్రులను శాలువలతో సత్కరించారు.

బస్తీల్లో అత్యధికం..

హై సొసైటీల్లో అత్యల్పం



- ఓటు ప్రాధాన్యతను గుర్తెరిగిన బస్తీవాసులు
- ఓటేయటానికి మొహం చాటేసిన విజ్ఞానవంతులు
- ఓటేయడంలో ఉత్సాహం చూపిన మురికివాడల్లోని ప్రజలు

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి నియోజకవర్గ పరిధిలోని కేపీహెచ్‌బీకాలనీ డివిజన్ మలేషియా టౌన్‌షిప్‌లో అత్యల్పంగా 27.56 శాతం మాత్రమే ఓట్లు పోలయ్యాయి. బూత్ నం.338లో 722 ఓట్లు ఉంటే కేవలం 199 ఓట్లు మాత్రమే పోలయ్యాయి. టౌన్‌షిప్‌లో ఉన్న క్లబ్‌హౌస్‌లో పోలింగ్ కేంద్రం ఉన్నప్పటికీ అంతా చదువుకున్న విజ్ఞానవంతులు కలిగిన ఈ కాలనీలో 27 శాతం కూడా పోల్ కాకపోవడంపై సర్వత్రా చర్చ జరుగుతోంది.

◆ కేపీహెచ్‌బీ కాలనీలోని 7వ ఫేజ్ బాస్కెట్ బాల్ గ్రౌండ్‌లోని పోలింగ్ బూత్‌లో 940 మంది ఓటర్లు ఉన్నారు. 541 ఓట్లు పోలై 57.55 శాతం నమోదై కేపీహెచ్‌బీ కాలనీలోనే రికార్డు నమోదు చేసింది. కేపీహెచ్‌బీ కాలనీలో ఉన్న ప్రజలు భారీ సంఖ్యలో ఓటు వేయడానికి ఆంధ్రాకు తరలినప్పటికీ కేపీహెచ్‌బీ కాలనీ 7వ ఫేజులో ఇంత పెద్ద సంఖ్యలో ఓట్లు నమోదు కావటం విశేషం.

వెనుకబడిన ప్రాంతాల్లో అత్యధిక పోలింగ్

◆ కూకట్‌పల్లి నియోజకవర్గంలో సేవాలాల్ తండా ఎంపీపీ స్కూల్‌లో 1160 ఓట్లు ఉండగా 733 ఓట్లు పోలై అత్యధికంగా 63.19 శాతం పోలింగ్ నమోదు కావటం విశేషం. నియోజకవర్గంలో అత్యధికంగా వెనుకబడిన ఈ ప్రాంతంలో అత్యధిక పోలింగ్ కావటంపై సర్వత్రా హర్షం వ్యక్తం అవుతోంది.

◆ మూసాపేట అంజయ్యనగర్‌లో 1294 మంది ఓటర్లు ఉండగా 825 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఇక్కడ 63.76 శాతం ఓటింగ్ నమోదైంది. నియోజకవర్గంలోని అత్యధికంగా వెనుక బడిన ప్రాంతాల్లో ఇది కూడా ఒకటి.

◆ ఫతేనగర్‌లోని ప్రాథమిక పాఠశాలలో 669 మంది ఓటర్లు ఉంటే 429 మంది ఓటు వేశారు. మొత్తం 64 శాతానికి పైగా ఓటింగ్ నమోదు కావటం విశేషం.

◆ ఓల్డ్ బోయినపల్లిలోని గంగపుత్ర కమ్యూనిటీహాల్‌లో 64శాతం ఓటింగ్ నమోదు కావడం అందరినీ ఆశ్చర్యపరిచింది. అక్షరాస్యత తక్కువ ఉన్న ప్రాంతాల్లోనే అత్యధిక పోలింగ్ నమోదు కావడంపై రాజకీయ విశ్లేషకులు అభినందనలు తెలుపుతున్నారు. అక్షరాస్యత ఎక్కువ ఉన్న ప్రాంతాల్లో అత్యల్పంగా నమోదు కావడంపై విస్మయం వ్యక్తం చేస్తున్నారు.

మురికివాడల్లో కంటే హై సొసైటీలోనే ఎక్కువ ప్రచారం చేయాలి

◆ ఓటు హక్కును వినియోగించుకోవాలని ప్రచార మాధ్యమాల్లో ప్రచారం చేసినప్పటికీ పాష్ ఏరియాల్లోని ప్రజలు ఓటింగ్‌లో పాల్గొనకపోవటంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు మురికివాడల్లో కంటే హై సొసైటీలోనే ఎక్కువ ప్రచారం చేసి వారిలో అవగాహన కల్పించాలని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ప్రభుత్వం నుంచి వచ్చే మౌలిక సదుపాయాలపై వారికి ఆంక్షలు విధించాలని సూచనలు చేస్తున్నారు.



గెలుపుపై ఎవరి ధీమా వారిదే..

కూకట్‌పల్లి: మల్కాజ్‌గిరి లోక్‌సభ పరిధిలోని కూకట్‌పల్లి నియోజకవర్గంలో జరిగిన ఓటింగ్ సరళిని బట్టి అన్ని పార్టీలు ఎవరికి వారే ధీమా వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ వ్యతిరేకతతో పాటు తమ పార్టీపై ఉన్న నమ్మకంతో గత అసెంబ్లీ ఎన్నికలో ఏ విధంగా ఓట్లు పోలయ్యాయో ఈసారి కూడా అదే నిష్పత్తిలో తమకు ఓట్లు పోలయ్యాయని బీఆర్ఎస్ నాయకులు ధీమా వ్యక్తం చేస్తున్నారు. ఈసారి ఎన్నికల్లో 2,33,714 ఓట్లు పోలవ్వగా లక్షకు పైగా ఓట్లను సాధిస్తామని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ధీమాగా ఉన్నారు.

కూకట్‌పల్లి 60శాతం ఓట్లు బీజేపీకే..

◆ ఈసారి జరిగిన మహా సంగ్రామ ఎన్నికల్లో ప్రాంతీయ పార్టీలకు ఎలాంటి సంబంధం లేకుండా కాంగ్రెస్, బీజేపీ పార్టీల మధ్యనే పోరాటం జరిగిందని బీజేపీ నేత వడ్డేపల్లి రాజేశ్వరరావు పేర్కొన్నారు. రాష్ట్రంలో జరుగుతున్న విచ్చలవిడి వ్యవహారాన్ని ప్రజలు తెలుసుకున్నారని తెలిపారు. మోదీ లాంటి నాయకుడిని కోరుకుంటున్నారని అన్నారు. 60 శాతం ఓట్లు బీజేపీకే పోలయ్యాయని పేర్కొన్నారు.

ఇక్కడ కాంగ్రెస్‌కు లక్ష మెజార్టీ..

◆ కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు సత్యం శ్రీరంగం మాట్లాడుతూ... ఈసారి మల్కాజ్‌గిరి లోక్‌సభలో అత్యధిక మెజార్టీ సాధిస్తామన్నారు. ముఖ్యంగా కూకట్‌పల్లి నియోజకవర్గంలో లక్ష ఓట్లను సాధిస్తామని తెలిపారు.

ఎవరు గెలిచినా వేల సంఖ్యలోనే తేడా ఉంటుంది

◆ ఈ విధంగా నియోజకవర్గంలోని మూడు పార్టీల వారు తమ గెలుపు ధీమాపై ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. నియోజకవర్గంలో గత అసెంబ్లీ కంటే ఈసారి తక్కువ ఓటింగ్ జరిగినప్పటికీ ఎవరు గెలిచినా వేల సంఖ్యలోనే తేడా ఉంటుందని రాజకీయ విశ్లేషకులు చర్చించుకుంటున్నారు. ఏది ఏమైనా జూన్ 4వ తేదీ వరకు వేచి చూడాల్సిందే.

ఎవరి లెక్కలు వారివే..

అందరి చూపు మల్కాజిగిరి పార్లమెంట్ వైపు..

- పోలింగ్ సరళిపై ఆరా తీస్తున్న పార్టీలు
- ఓట్లపై లెక్కలేసుకుంటున్న అభ్యర్థులు

సాక్షి, మేడ్చల్ జిల్లా: దేశంలో అతి పెద్ద నియోజకవర్గమైన మల్కాజిగిరి పార్లమెంట్ స్థానంలో ఎవరు గెలుస్తారన్న విషయంపైనే ప్రజల్లో వాడీవేడి చర్చ సాగుతోంది. దీనికి ప్రధాన కారణం తెలంగాణ సీఎం అనుముల రేవంత్‌రెడ్డి ప్రాతినిధ్యం వహించిన కాంగ్రెస్ సిట్టింగ్ సీటు కావడమేనని తెలుస్తోంది. అయితే ఇక్కడ నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా సీఎం రేవంత్‌రెడ్డి ఏరికోరి పార్లమెంట్ ఎన్నికల ముందే పార్టీలో చేరిన మాజీ మంత్రి, ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి సతీమణి, వికారాబాద్ జెడ్పీ చైర్మన్ పట్నం సునీతారెడ్డిని కాంగ్రెస్ అభ్యర్థిగా బరిలో నిలిపారు. అలాగే, బీజేపీ నుంచి మాజీ మంత్రి, సీనియర్ నేత ఈటల రాజేందర్ అధిష్టానం పోటీలో పెట్టింది. బీఆర్ఎస్ నుంచి రాగిడి లక్ష్మారెడ్డి తమ అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు. ఎన్నికలు ముగియడంతో గెలుపుపై మూడు ప్రధాన పార్టీలు ధీమాను వ్యక్తం చేయడంతో.. అసెంబ్లీ సెగ్మెంట్ల వారీగా లెక్కలేసుకుంటున్నారు.

గెలుపుపై ఆశాభావం...

మల్కాజిగిరి పార్లమెంట్ పరిధిలో గట్టి పోటీ ఇచ్చినట్లుగా బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్ భావిస్తుండటంతో పాటు గెలుస్తామన్న ధీమాతో కేడర్‌కు భరోసా ఇస్తున్నారు. అలాగే, కాంగ్రెస్ అభ్యర్థి సునీతామహేందర్‌రెడ్డి కూడా అనుచరులతో సహా అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా కార్యకర్తలతో పోలింగ్ సరళిపై లెక్కలేసుకుంటూ.. గెలుపుపై ఆశాభావాన్ని వ్యక్తం చేస్తున్నట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. సీఎం రేవంత్‌రెడ్డితో సహా పార్టీ ముఖ్యనేతలు కూడా మల్కాజిగిరి ఓటింగ్ సరళి తదితర విషయాలపై ఆరా తీయడంతో పాటు గెలుపు ధీమా వ్యక్తం చేస్తున్నట్లు జిల్లా పార్టీ వర్గాలు పేర్కొంటున్నాయి.

ఏడు అసెంబ్లీ సెగ్మెంట్లలో..

బీఆర్ఎస్ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి కూడా గెలుపుపై ధీమా వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో మల్కాజిగిరి పార్లమెంట్ పరిధిలోని ఏడు అసెంబ్లీ సెగ్మెంట్లలో బీఆర్ఎస్ ఘన విజయం సాధించడమే తమ గెలుపు అంటున్నారు.

కూరగాయల ధరలు

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి రైతుబజార్‌లో కూరగాయల ధరలు కిలో రూపాయల్లో.. టమాట 23, వంకాయ 23, బెండకాయ 35, పచ్చిమిర్చి 50, బజ్జీమిర్చి 35, కాకరకాయ 35, బీరకాయ 35, క్యాబేజి 18, బీన్స్ 85, క్యారెట్ 35, గోబిపువ్వు 18, దొండకాయ 28, చిక్కుడుకాయ 65, గోరుచిక్కుడు 35, బీట్‌రూట్ 23, క్యాప్సికం 45, ఆలుగడ్డ 28, కీరా 18, దోసకాయ 15, సొరకాయ11, పొట్లకాయ 15, కంద 70, ఉల్లిపొరక 65, ఉల్లిగడ్డ 22, మామిడికాయ 10 నుంచి 15, అరటికాయ 7 నుంచి 8, చామగడ్డ 40, ముల్లంగి 4 నుంచి 5, చిలగడ దుంప 23, గుమ్మడికాయ 35, నిమ్మకాయలు 65 నుంచి 75, మునగకాయలు 4 నుంచి 5, బొప్పాయి 40, పుట్టగొడుగులు 40, ఎండుమిర్చి 220, అల్లం 180, వెల్లుల్లి 240, చింతపండు 120, పండుమిర్చి 80, ఉసిరి 40, వేరుశెనగ నూనె 165, పామాయిల్ నూనె 97లుగా ఉన్నాయి.

గమనిక: ఈ ధరలు బుధవారం ఉదయం 9గంటల వరకు మాత్రమే అమలులో ఉంటాయి.

కాంగ్రెస్ అభిమానులు, కార్యకర్తలకు కృతజ్ఞతలు



నాయకులు, కార్యకర్తల సమీక్షా సమావేశంలో పాల్గొన్న కూకట్‌పల్లి పార్టీ ఇన్‌చార్జ్ బండి రమేష్

కూకట్‌పల్లి: మల్కాజ్‌గిరి లోక్‌సభ ఎన్నికలు ముగిసిన నేపథ్యంలో మంగళవారం మంగళవారం బాలానగర్ పార్టీ కార్యాలయంలో కూకట్‌పల్లి కాంగ్రెస్ ఇన్‌చార్జి బండి రమేష్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఎంపీ ఎన్నికల్లో కష్టపడ్డ పార్టీ అభిమానులు, నాయకులు, కార్యకర్తలు, ఓటర్లకు కృతజ్ఞతలు తెలిపారు. అన్ని సర్వేలు మల్కాజ్‌గిరిలో పట్నం సునీతామహేందర్‌రెడ్డి లక్ష ఓట్ల మెజార్టీతో గెలవటం ఖాయమని చెబుతున్నాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బాక్ అధ్యక్షుడు నాగిరెడ్డి, వేణు, శేరి సతీష్‌రెడ్డి, గొట్టిముక్కల వెంకటేశ్వరరావు, గాలి బాలాజీ, రఘు, సాదు ప్రతాప్‌రెడ్డి, బషీర్, బ్రోచర్, పిడికిటి గోపాల్ చౌదరి, మోహన్‌రెడ్డి, డివిజన్ అధ్యక్షులు మేకల రమేష్, మహిళా నాయకురాళ్లు పుష్పారెడ్డి, రమాదేవి, రేష్మా, జ్యోతి, రజిత, కృష్ణ వేణి, బోజమ్మ, భారతమ్మ, రాధా తదితరులు పాల్గొన్నారు.

స్ట్రాంగ్ రూమ్‌లోకి ఈవీఎంలు

మూడంచెల పటిష్ట భద్రత ఏర్పాటు



సాక్షి, మేడ్చల్ జిల్లా: మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని పోలింగ్ కేంద్రాల నుంచి తరలించిన ఎల్రక్టానిక్ ఓటింగ్ యంత్రాల (ఈవీఎం)ను ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా మంగళవారం భోగారంలోని హోలీ మేరీ కాలేజీ, సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియం, సికింద్రాబాద్ వెస్లీ కాలేజీలలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్‌రూమ్‌లో భద్రపరిచారు. మల్కాజిగిరి లోక్‌సభ నియోజకవర్గం జనరల్ అబ్జర్వర్ డాక్టర్ ప్రియాంక శుక్లా, రిటర్నింగ్ అధికారి గౌతమ్, జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి, పార్టీల ఏజెంట్‌ల సమక్షంలో స్ట్రాంగ్‌రూమ్‌లకు సీల్‌వేసి భద్రపరిచారు. స్ట్రాంగ్‌రూమ్‌లకు సీఆర్‌పీఎఫ్ పోలీస్ సిబ్బందితో 24 గంటలు నిరంతర పర్యవేక్షణ ఉంటుందని రిటర్నింగ్ అధికారి గౌతమ్ తెలిపారు.

◆ మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గంలోని మేడ్చల్, మల్కాజిగిరి, ఉప్పల్, కుత్బుల్లాపూర్, కూకట్‌పల్లి అసెంబ్లీ సెగ్మెంట్లకు సంబంధించిన ఈవీఎమ్‌లను కట్టుదిట్టమైన భద్రత నడుమ భోగారంలోని హోలీ మేరీ కళాశాలలోని స్ట్రాంగ్‌రూమ్‌లో భద్రపరచగా.. ఎల్‌బీనగర్ అసెంబ్లీ సెగ్మెంట్‌కు సంబంధించిన ఈవీఎంలు సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియం, సికింద్రాబాద్ కంటోన్మెంట్ సెగ్మెంట్‌కు సంబంధించిన ఈవీఎంలు సికింద్రాబాద్ వెస్లీ కళాశాలలో భద్రపరిచినట్లు రిటర్నింగ్ అధికారి గౌతమ్ వివరించారు. స్ట్రాంగ్ రూమ్‌లకు మూడంచెల పటిష్ట భద్రతను ఏర్పాటు చేశామన్నారు. అసెంబ్లీ సెగ్మెంట్ల ఏఆర్‌ఓలు, ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.

ప్లాస్టిక్ కవర్ల కోసం దిగి... నాలాలో కూరుకుపోయి..



నాలాలో కొట్టుకొచ్చిన మృతదేహం

బంజారాహిల్స్: ఖైరతాబాద్ నాలాలో ఓ మృతదేహం కొట్టుకువచ్చింది. వివరాల్లోకి వెళ్తే... మంగళవారం ఉదయం ఇద్దరు వ్యక్తులు నడుచుకుంటూ విశ్వేశ్వరయ్య భవన్ ఎదురుగా ఉన్న మెట్రోస్టేషన్ పక్కన ఖైరతాబాద్ నాలాలోకి వెళ్లారు. వీరిద్దరూ ప్లాస్టిక్ కవర్లు, కాగితాలు ఏరుకొని జీవించేవారిగా పోలీసులు గుర్తించారు. అందులో ఓ యువకుడు నాలాలో ప్లాస్టిక్ కవర్లు ఏరేందుకు నాలాలోకి దిగి బురదలో కూరుకుపోయాడు. ఉదయం 11 గంటల సమయంలో నాలాలో మృతదేహం ఉన్నట్లుగా స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఖైరతాబాద్ పోలీసులు క్లూస్ టీమ్ సహాయంతో మృతదేహాన్ని స్వాధీనం చేసుకొని మార్చురీకి తరలించారు. మృతదేహానికి సంబంధించిన వివరాల కోసం ఆరా తీస్తున్నారు.

ఓటర్లకు, పార్టీ నాయకులకు ధన్యవాదాలు

ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు



కూకట్‌పల్లి: కూకట్‌పల్లి నియోజకవర్గ ఓటర్లకు.. బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలకు ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ధన్యవాదాలు తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ.. మల్కాజ్‌గిరి లోక్‌సభ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి గెలుపు కోసం అహర్నిశలు కృషి చేసిన కార్యకర్తలను పార్టీ గుర్తించుకుంటుందన్నారు.

కాంగ్రెస్ కూడా బీఆర్ఎస్ దారిలోనే...

ఎమ్మెల్సీ అభ్యర్థి బక్క జడ్సన్

పంజగుట్ట: గత పది సంవత్సరాల్లో జరిగిన బీఆర్ఎస్ ప్రభుత్వ తప్పిదాలను తెలుసుకుని ప్రజలు కాంగ్రెస్‌కు అధికారం ఇస్తే అది కూడా అదే దారిలో పోతోందని వరంగల్, నల్లగొండ, ఖమ్మం పట్టభద్రుల శాసనమండలి నియోజకవర్గ అభ్యర్థి బక్క జడ్సన్ అన్నారు. మంగళవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఉద్యమకారులు తెలంగాణ విఠల్, పృథ్వీరాజ్‌తో కలిసి ఆయన మాట్లాడారు. అసెంబ్లీ ఎన్నికల ప్రచారానికి వచ్చిన కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ మాట్లాడుతూ కాంగ్రెస్ అధికారంలోకి రాగానే జాబ్ కేలండర్ ప్రకారం రెండు లక్షల ఉద్యోగాలు ఇస్తామని ప్రకటించారని, కానీ ఇప్పటివరకు ఏ శాఖలో ఎన్ని ఖాళీలు ఉన్నాయో కూడా గుర్తించలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. తాము గత సంవత్సరం డిసెంబర్ నాటికి 2.67 లక్షల ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయని గుర్తించామన్నారు.

డయగ్నస్టిక్ సెంటర్లు సీజ్

నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవన్న డీఎంహెచ్ఓ



సాక్షి,మేడ్చల్ జిల్లా: మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా ఉప్పల్‌లోని గురుకృపా కాంప్లెక్స్‌లోని వాసవి డయగ్నస్టిక్ సెంటర్‌తో సహా శోభసాయి డయగ్నస్టిక్ సెంటర్‌లోని అల్ట్రాసౌండ్ మెషిన్లను మంగళవారం జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి (డీఎంహెచ్ఓ)సీజ్ చేశారు. ఈ సెంటర్లలో గర్భనిర్ధారణ ప్రక్రియలకు సంబంధించి ప్రభుత్వ నిబంధనలు, సూచనలను పేర్కొనకపోవడంతో పాటు సంబంధిత వైద్యులు అందుబాటులో లేకపోవడం తదితర కారణాలతో వాటిని సీజ్ చేశామన్నారు. సెంటర్లలో సరిగ్గా నింపని ఫారమ్–ఎఫ్‌లు, స్కాన్ చేస్తున్న వైద్యులు సంతకం చేయని నివేదికలు కూడా బయటపడ్డాయి. రిజిస్టర్లను తప్పనిసరిగా నిర్వహించకపోవడం, ఆన్‌లైన్‌లో సమర్పించకపోవడం, ఎంట్రీలు లేకపోవడం, ప్రీ–కాన్సెప్షన్ అండ్ ప్రీ–నేటల్ డయగ్నస్టిక్ టెక్నిక్స్ యాక్ట్ –1994 కింద నిబంధనలు, సెక్షన్ల ప్రకారం సీజ్ చేశామని డీఎంహెచ్ఓ స్పష్టం చేశారు. డయగ్నస్టిక్ సెంటర్లలో గర్భనిర్ధారిత స్కాన్లకు సరైన దస్తావేజులు లేకుంటే కఠినమైన చర్యలు తీసుకుంటామని జిల్లా వైద్య, ఆరోగ్య అధికారి డా.టి.రఘునాథస్వామి తెలిపారు. కీసర డివిజన్ ఉప జిల్లా వైద్య, ఆరోగ్యాధికారి నారాయణరావు, ప్రోగ్రామ్ అధికారి (మాత–శిశువు) డాక్టర్ సౌందర్యలత, శ్రీనివాస్ పాల్గొన్నారు.

వైభవంగా భగీరథ మహర్షి జయంతి వేడుకలు

ఆల్విన్‌కాలనీ: భగీరథ మహర్షి జయంతి వేడుకలు మంగళవారం సగర, ఉప్పర సంఘం జగద్గిరిగుట్ట ఆధ్వర్యంలో వైభవంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి హాజరై ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ మాట్లాడుతూ... భగీరథ మహర్షి పేరుపై కేసీఆర్ మిషన్ భగీరథ కార్యక్రమాన్ని తీసుకొచ్చారన్నారు. ఇంటింటికీ తాగునీటిని సరఫరా చేశారని తెలిపారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ మాధవరం రంగారావు, వివేకానందనగర్ డివిజన్ అధ్యక్షుడు సంజీవరెడ్డి, స్థానిక సగర సంఘం అధ్యక్షుడు అస్కనీ కొండయ్య సాగర్, ప్రధాన కార్యదర్శి అస్కని శ్రీనివాస్ సాగర్, కోశాధికారి రాజేష్ సాగర్, గ్రేటర్ హైదరాబాద్ సగర ఉప్పర సంఘం గౌరవఅధ్యక్షుడు అస్కని వెంకటస్వామి సాగర్, అధ్యక్షుడు మోడల రవి సాగర్, ప్రధాన కార్యదర్శి అవుల వెంకట రాములు సాగర్, కోశాధికారి రామస్వామి సాగర్ తదితరులు పాల్గొన్నారు.



భగీరథ మహర్షి జయంతి వేడుకల్లో ఎమ్మెల్యే గాంధీ, సగర, ఉప్పర సంఘం నాయకులు

తాగునీరు వృథా.. పట్టించుకోకపోతే ఎలా?

ఆల్విన్‌కాలనీ: అసలే మండుటెండలు.. దీనికి తోడు తాగునీరు దొరకక నానా అవస్థలు పడుతున్నారు. ఇలాంటి పరిస్థితిలో వాటర్‌వర్క్స్ అధికారులు, సిబ్బంది అలసత్వం కారణంగా పలు ప్రాంతాల్లో తాగునీరు వృథాగా పోతోంది. కాలనీవాసులు అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని వాపోయారు. వేల గ్యాలన్ల నీరు రోడ్డు పాలవుతోంది. కూకట్‌పల్లి డివిజన్ పరిధిలోని ఆస్‌బెస్టాస్ కాలనీ కమాన్ వద్ద మంచినీటి పైపులైను దెబ్బతిని నీరు వృథాగా పోతోంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.



ఆస్‌బెస్టాస్‌కాలనీ కమాన్ వద్ద రోడ్డుపై పారుతున్న తాగునీరు